సాక్షి
పెద్దపల్లి

ఆదివారం : 17 : మార్చి : 2024



సీపీని కలిసిన సెక్యూరిటీ జీఎం

గోదావరిఖని: రామగుండం సీపీ శ్రీనివాస్‌ను సింగరేణి సెక్యూరిటీ జీఎం జీఆర్ దీక్షితులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేశారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్		సహర్
ఆది	6:32	సోమ	5:01

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/24.0

ఆకాశం మేఘావృతం అవుతుంది. జిల్లాలో తేలికపాటి జల్లులు కురుస్తాయి. ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సకాలంలో సీఎంఆర్ రైస్ అందించండి



కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రైస్ మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ రైస్ అందించాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సివిల్‌సప్లయి కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. గతేడాది రైస్ డెలివరీ, సీఎంఆర్ డెలివరీ, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. జిల్లాలో సీఎంఆర్ రైస్ డెలివరీని మిల్లర్లు సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేంకుమార్, మేనేజర్ శ్రీకాంత్ తదితరులున్నారు.

పక్కాగా అమలు చేయాలి

పెద్దపల్లిరూరల్: లోకసభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిందని, జిల్లాలో పక్కాగా ఎన్నికల కోడ్ అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ పాల్గొన్నారు. పార్లమెంట్‌కు 7దశల్లో ఎన్నికలు జరుగుతున్నాయని, తెలంగాణలో 4వ దశ మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూలు విడుదలైనందున కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. రాజకీయపార్టీలు, నాయకుల ఫొటోలు వాల్‌రైటింగ్ తొలగించాలన్నారు. వెబ్‌సైట్లలోనూ సీఎం, మంత్రుల ఫొటోలు ఉంచరాదన్నారు. ఎన్నికల నియమావళి మేరకు నగదు, మద్యం లాంటి వాటిని సీజ్ చేయాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆర్డీవో హనుమానాయక్, ఏవో శ్రీనివాస్, డీటీ ప్రవీణ్ తదితరులున్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఎంపీపీ రమాదేవి

జూలపల్లి(పెద్దపల్లి): యువత గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న గ్రంథాలయాలను వినియోగించుకొని లక్ష్యం సాధించాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. మండలంలోని వెంకట్రావుపల్లెలో పల్లె పౌర పఠనాలయాన్ని మండల అధ్యక్షురాలు కూసుకుంట్ల రమాదేవితో కలిసి ప్రారంభించారు. గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. ఎంపీడీవో పద్మజ, ఎంపీవో కిరణ్, ఏపీవో సదానందం, జిల్లా గ్రంథాలయ సెక్రెటరీ ఏవీఎస్ రాజు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

మంథని: ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులకు బకాయి ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై. అశోక్‌కుమార్ కోరారు. శనివారం మంథని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడారు. ఉపాధ్యాయుల కుటుంబ ఆర్థిక అవసరాలకు ప్రభుత్వానికి పంపిన జీపీఎఫ్, ప్రభుత్వ జీవిత బీమా, సరెండర్ లీవ్ బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సూద రాజేందర్, ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి, కార్యదర్శులు గుంటి ఎల్లయ్య, రావుల రమేశ్, రాములు, నాయకులు కోల రాజమల్లు, దేవదానం, చంద్రశేఖర్, రాంబాబు, కుమారస్వామి, శ్రీనివాస్, బాలయ్య, రాంనారాయణ, కొమురెల్లి, తిరుపతి ఉన్నారు.

బీఎస్పీకి ఉష రాజీనామా

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి దాసరి ఉష ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి ముందుగా బీఆర్‌ఎస్‌తో పొత్తుకు అంగీకరించి, తర్వాత మాట మార్చడానికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉష పేర్కొన్నారు. ఆదివారం తన అనుచరులతో సమావేశమై వారి ఆలోచనలకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

కోడ్ కూసింది!



లోక్‌సభ షెడ్యూల్: నామినేషన్లు మొదలు: ఏప్రిల్ 18, చివరి తేదీ: ఏప్రిల్ 25, నామినేషన్లు పరిశీలన: ఏప్రిల్ 26
ఉపసంహరణ: ఏప్రిల్ 29, పోలింగ్ తేదీ: మే 13, ఎన్నికల ఫలితాలు: జూన్ 4

- షెడ్యూల్ విడుదలతో వేడెక్కిన రాజకీయం
- శనివారం మధ్యాహ్నం నుంచే అమల్లోకి ఎన్నికల కోడ్
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్
- మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్
- ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం
- ఇప్పటికే కాంగ్రెస్ మినహా బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారు

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్లు

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
కరీంనగర్	1,81,093	1,81,388	43	99	3,62,623
చొప్పదండి	1,13,620	1,21,524	6	196	2,35,346
వేములవాడ	1,07,783	1,17,508	32	53	2,25,376
సిరిసిల్ల	1,19,140	1,25,967	8	106	2,45,221
మానకొండూర్	1,09,947	1,14,902	1	128	2,24,978
హుజూరాబాద్	1,21,294	1,27,967	7	164	2,49,432
హుస్నాబాద్	1,21,081	1,25,076	5	215	2,46,377

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్ల వివరాలు

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
ధర్మపురి	1,11,962	1,17,647	06	133	2,29,748
రామగుండం	1,10,255	1,09,970	26	213	2,20,464
మంథని	1,17,271	1,21,820	17	155	2,39,263
పెద్దపల్లి	1,26,404	1,29,965	07	264	2,56,640
చెన్నూరు	95,974	97,264	7	134	1,93,379
బెల్లంపల్లి	86,802	88,530	13	163	1,75,508
మంచిర్యాల	1,38,472	1,40,559	25	334	2,79,390

సాక్షిప్రతినిధి, కరీంనగర్/సాక్షి,పెద్దపల్లి:

సార్వత్రిక ఎన్నికల సమరం మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం మధ్యాహ్నం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎన్నికల ప్రవర్తనా నియమావళి) అమల్లోకి వచ్చింది. ఇక నుంచి పార్టీలు, అభ్యర్థులంతా ఎన్నికల నిబంధనలకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలుకు జిల్లాయంత్రాంగం అవసరమైన ఏర్పాట్లతో సిద్ధమైంది. జిల్లాలో ఇప్పటికే ఓటర్ల జాబితా విడుదల చేయగా, పోలింగ్‌కేంద్రాల గుర్తింపు పూర్తయ్యింది. అవసరమైన చోట చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సిబ్బంది బదిలీలపై నిషేధం ఉండనుండగా, నేతలు ప్రార్థనా స్థలాల్లో ప్రచారం నిర్వహించరాదు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు చేయకూడదు.రాజకీయ పార్టీల నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగిస్తున్నారు. మద్యం, డబ్బుల పంపిణీని అరికట్టేందుకు చర్యలు ప్రారంభించారు.

79 రోజుల తరువాత తేలనున్న ఫలితం

వచ్చే నెల 18 తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఏప్రిల్ 25వరకు నామినేషన్లు స్వీకరణ, 26న పరిశీలన, 29వరకు విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మే 13న పోలింగ్ నిర్వహించనుండగా, జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. నేటి నుంచి పోలింగ్‌కు 62రోజుల సమయం ఉండగా, విజేతలెవరో తెలియడానికి 79రోజుల వరకు ఆగాల్సిందే. ఎన్నికల ప్రక్రియ మొత్తం జూన్ 6తో ముగియనుంది. అప్పటి వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. దీంతో ఇప్పటికే ఉమ్మడి జిల్లాయంత్రాంగం గోడలపై ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన రైటింగ్స్, ఇతర రాతలను తుడిచివేయడం ప్రారంభించారు. ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు, రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగువేస్తున్నారు.

తేలాల్సింది కాంగ్రెస్ అభ్యర్థులే...

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలకు బీజేపీ తరుపున బండి సంజయ్, గోమాస శ్రీనివాస్‌లను బరిలో నిలవనుండగా, బీఆర్‌ఎస్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, కొప్పుల ఈశ్వర్ అభ్యర్థిత్వాలు ఖరారు అయ్యాయి. నిజామాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్, బీఆర్‌ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డిలు బరిలో నిలుచున్నారు. ఈ మూడు నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థిత్వాలు ఖరారు చేయాల్సి ఉంది. కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారైతే ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది.

ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం

- 'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు
- 45 కేంద్రాలు.. 7,728 మంది విద్యార్థులు
- ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు
- 'సాక్షి'తో జిల్లా విద్యాధికారి మాధవి



మాధవి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా విద్యాధికారి మాధవి పేర్కొన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధమని, ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వివరించారు. రేపటి నుంచి (ఈ నెల 18) ఏప్రిల్ 2 వరకు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా రాయాలన్నారు. పరీక్షల ఏర్పాట్లపై శనివారం 'సాక్షి'తో మాట్లాడారు.

సాక్షి: పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయా..?

డీఈవో: ఈనెల 18నుంచి మొదలయ్యే టెన్త్ పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రశ్నాపత్రాలను కూడా సమీప పోలీస్‌స్టేషన్లలో భద్రపర్చాం.

సాక్షి: జిల్లా వ్యాప్తంగా ఎంతమంది పరీక్షలకు హాజరవుతున్నారు..?

డీఈవో: జిల్లాలో 7,728 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం 45 కేంద్రాలు ఏర్పాటు చేశాం.

సాక్షి: హాల్ టికెట్ ఇవ్వకుండా ప్రైవేట్ స్కూల్ యజమాన్యాలు ఇబ్బంది పెడితే..?

డీఈవో: ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేశారు. ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలు ఇవ్వకుంటే ఆన్‌లైన్ సెంటర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అంతే కాకుండా సదరు పాఠశాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

సాక్షి: మాస్ కాపీయింగ్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు..?

డీఈవో: పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించం. ప్రతీ సెంటర్‌కు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ అధికారిని నియమించాం. సిట్టింగ్ స్క్వాడ్‌తో పాటు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెంచాం.

సాక్షి: ఎండ తీవ్రతను ఎదుర్కొనేందుకు ఏర్పాట్లు చేశారా..?

డీఈవో: పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ కోతలు ఉండకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాల్లో తాగునీరు, ఫస్ట్‌ఎయిడ్ బాక్సుతో పాటు వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుతాం. పరీక్షా సమయంలో బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులకు కూడా ఆదేశాలున్నాయి.

సాక్షి: విద్యార్థులకు ఇచ్చే సూచనలేంటీ..?

డీఈవో: విద్యార్థులు ఒత్తిడికి లోను కావొద్దు. ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలొస్తాయి. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో అదనపు తరగతులు నిర్వహించి సందేహాలను నివృత్తి చేశారు. పరీక్షా కేంద్రంలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు.

కక్షపూరితంగా వ్యవహరిస్తున్న మోదీ సర్కార్



నల్లజెండాలతో ర్యాలీ తీస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే చందర్, బీఆర్‌ఎస్ శ్రేణులు

గోదావరిఖని(రామగుండం): బీఆర్‌ఎస్‌పై మోదీ సర్కార్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా శనివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో నల్లజెండాలతో ర్యాలీ నిర్వహించి, ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ముందస్తు సమాచారం ఇవ్వకుండా కవితను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పెంట రాజేశ్, కల్వచర్ల కృష్ణవేణి, కన్నూరి సతీశ్‌కుమార్, నడిపెల్లి మురళీధర్‌రావు, బొడ్డు రవీందర్, నూతి తిరుపతి, జాహిద్‌పాషా, చల్లగురుగుల మొగిళి, పిల్లి రమేశ్, మెతుకు దేవరాజ్, చల్లా రవీందర్‌రెడ్డి, అడప శ్రీనివాస్, మాదాసు రామ్మూర్తి పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

జ్యోతినగర్(రామగుండం): ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షల ఫీజు తత్కాల్ గడువు పొడిగించినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ఏప్రిల్/మేలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సెస్సీ ప్రతి సబ్జెక్టుకు రూ.100 ఫీజుతో పాటు తత్కాల్ రుసుము రూ.500, ఇంటర్ ప్రతి సబ్జెక్టుకు రూ.150తో పాటు తత్కాల్ ఫీజు రూ.1,000 టీఎస్ ఆన్‌లైన్,మీ సేవ సెంటర్లలో చెల్లించవచ్చని తెలిపారు. ఈనెల 18 నుంచి 21 వరకు గడువు ఉందని వివరించారు. మరిన్ని వివరాలకు 83092 12661 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు సమన్వయంతో ముందుకెళ్లాలి



పాఠశాల వార్షికోత్సవంలో చిన్నారుల ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తదితరులు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: విద్యార్థులకు మంచి భవిష్యత్ అందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శనివారం పెద్దపల్లిలోని అమర్‌నగర్ అప్పర్‌ప్రైమరీ పాఠశాల వార్షికోత్సవం, పేరెంట్, టీచర్స్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించామని, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా టీఎల్‌ఎం పద్ధతిన ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్నారని తెలిపారు. పాఠశాలల్లో పీటీఎం సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అకడమిక్ అధికారి షేక్, హెచ్‌ఎం మంజులత, ఎంఈవో సురేందర్‌కుమార్, తిరుపతిరావు తదితరులున్నారు.

ప్రజావాణి తాత్కాలికంగా రద్దు

జిల్లాలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. లోకసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో జిల్లా అధికారులంతా ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

సింగరేణిలో పలువురు అధికారుల బదిలీ


గోదావరిఖని(రామగుండం): సింగరేణి వ్యాప్తంగా ఉన్న సర్వే అధికారులను బదిలీ చేస్తూ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సీఆర్‌పీ/పీఈఆర్/సీ/26/823పేరున ఉత్తర్వులు వెలువడ్డాయి. సీహెచ్.రాజగోపాల్ భూపాల్‌పల్లి నుంచి ప్రాజెక్టు ప్లానింగ్‌కు, ఎల్.దయాకర్ సర్వే కార్పొరేట్ నుంచి భూపాల్‌పల్లి, శైలేంద్రకుమార్ కేకే-5 నుంచి మణుగూరు, వై.శ్రీనివాస్ ఆర్కే-7 నుంచి జేకేఓసీ, జె.వినోద్‌కుమార్ కేటీకే-1 నుంచి కేటీకేఓసీ-2, కె.రామాచారి ఖైరి ఓసీ నుంచి బెల్లంపల్లి ఇన్‌చార్జి, డి.చంద్రమౌళి ఓసీపీ-3నుంచి జీడీకే-2, 2ఏ, 5 కి బదిలీ అయ్యారు. మైనింగ్ విభాగంలో డి.శ్యాంసుందర్ ప్రాజెక్టు ప్లానింగ్ నుంచి ఎస్‌ఓటూ జీఎం, మణుగూరు, టి.శంకర్ ఓసీపీ-2 నుంచి ప్రాజెక్టు ప్లానింగ్, కార్పొరేట్, మెడికల్ విభాగంలో సి.వెంకటరమణ భూపాల్‌పల్లి నుంచి రామకృష్ణాపూర్, జి.లలిత కొత్తగూడెం నుంచి రామకృష్ణాపూర్ బదిలీ అయ్యారు.

మత్తు.. గమ్మత్తు.. చిత్తు!

- మత్తు బానిసలకు మార్ఫిన్ ఇంజెక్షన్లు
- ఆర్డర్‌పై నల్లమందు సరఫరా!
- కొరియర్ ద్వారా పార్సిల్స్ చేరవేత
- సైనిక్‌పురిలో తీగ లాగితే కదిలిన డొంక
- జగిత్యాల వైద్యుడు మదన్‌మోహన్ చీకటి దందా
- ఉమ్మడి జిల్లాలో డీసీఏ దాడులు విస్తృతం



జగిత్యాలలోని మానస ఈఎన్‌టీ ఆసుపత్రి



అక్రమంగా విక్రయిస్తున్న మార్ఫిన్ ఇంజెక్షన్లు

సాక్షిప్రతినిధి,కరీంనగర్/జగిత్యాల:'వైద్యో నారాయణో హరి' అంటారు. ప్రాణాలు కాపాడే వైద్యుడిని కనిపించే దైవంగా కొలుస్తాం. కానీ, ప్రాణాంతక మత్తు మందును పక్కదారి పట్టిస్తూ సాక్షాత్తూ వైద్యుడే చీకటి దందాకు తెరతీసిన వైనాన్ని డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) అధికారులు వెలుగులోకి తెచ్చారు. మార్ఫిన్ లాంటి నార్కోటిక్ ఇంజెక్షన్లు, మాత్రలను హైదరాబాద్‌లోని పలువురు మత్తుకు బానిసైన వారికి కొరియర్/పార్సిల్ ద్వారా అందజేస్తున్న తీరును చూసి విస్తుపోయారు. ఇటీవల కరీంనగర్‌లో ఎటోలార్-పి అనే నిషేధిత మాత్రలను సరఫరా చేస్తున్న గోదాంపై దాడులు చేసిన అధికారులు తాజాగా మత్తు మందులను దుర్వినియోగం చేస్తున్న తీరును బయటపెట్టారు.

ఎలా చిక్కారు?

జగిత్యాలకు చెందిన జి.మదన్‌మోహన్ మానస హాస్పిటల్‌లో ఈఎన్‌టీ వైద్యుడు. ఇతను రోగులకు మత్తు కోసం వినియోగించే మార్ఫిన్ ఇంజెక్షన్లు, మాత్రలను అక్రమమార్గంలో మత్తుకు బానిసైన వారికి విక్రయిస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్ సైనిక్‌పురి ప్రాంతంలోని శ్రీ సాయిబాబా ఆఫీసర్స్ కాలనీలోని ఓ ఇంట్లో మార్ఫిన్ ఇంజెక్షన్లు, మాత్రలు ఉన్నాయన్నా పక్కా సమాచారంతో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీ), తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వెర్మర్-15, రుమార్ఫ్ తదితర మార్ఫిన్ (నల్లమందుతో చేసేవి) ఇంజెక్షన్లు, మాత్రలు లభించాయి. అక్కడ తీగ లాగిన అధికారులకు డొంక జగిత్యాలలో దొరికింది. ఈ మందులన్నీ జగిత్యాలలోని మానస ఆసుపత్రి నుంచి డాక్టర్ మదన్‌మోహన్ ద్వారా వస్తున్నాయని గుర్తించారు. ఆ ఆస్పత్రి వాచ్‌మెన్ సాయంతో హైదరాబాద్‌లోని మత్తుబానిసలకు కొరియర్ చేస్తున్నారని దర్యాప్తులో తేలింది. ఇవి జగిత్యాలలోని గొల్లపల్లి రోడ్డులో ఉన్న మాన్విత ఫార్మసీకు చెందినవని కనిపెట్టారు. వాస్తవానికి నార్కోటిక్ డ్రగ్స్ విక్రయాలు జరిపేందుకు ప్రత్యేక అనుమతి ఉంటుంది. ఆయా మందుల వినియోగానికి రిజిస్టర్ నిర్వహించాల్సి ఉంటుంది. దాడుల సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్‌లో పలు అవకతవకలు ఉన్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా దాదాపు 75 మందులను సీజ్ చేశారు. దీని తరువాత కూడా డీసీఏ దాడులు ఉంటాయని 'సాక్షి' ముందే వెల్లడించింది. ఇదే క్రమంలో డాక్టర్ మదన్‌మోహన్‌ను అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించారు.

మార్ఫిన్ ప్రాణాంతకం..

మార్ఫిన్ డ్రగ్స్ వినియోగం వల్ల శరీరంపై దుష్ప్రభావాలు చూపిస్తుంది. శారీరక, మానసిక, భావోద్వేగ సమస్యలకు కారణమవుతుంది. కేవలం ఆపరేషన్ చేసే సమయంలో నిపుణులైన వైద్యులే దీన్ని పేషెంట్‌కు ఇస్తారు. దీన్ని వైద్యుల సలహాతో కాకుండా వ్యక్తిగతంగా వినియోగించడం నేరం, ప్రమాదకరం. ఒక్కసారి దీనికి అలవాటైతే బానిసలవుతారు. ఆ మందు కోసం దిగజారి ప్రవర్తిస్తారు. ఏమాత్రం మోతాదు పెరిగినా ప్రాణాలు పోతాయి. వైద్యులు, ఫార్మసిస్టుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ప్రాణాంతక మందులు అక్రమంగా బయటికి వస్తున్నాయి. ఇలాంటి ఉదంతాలు మీ దృష్టికి వస్తే వెంటనే 1800-599-6969 నంబరుకు సమాచారం ఇవ్వాలని డీసీఏ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్ రెడ్డి ఉమ్మడి జిల్లావాసులకు విజ్ఞప్తిచేశారు. ఈ క్రమంలో సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోనూ పలు అక్రమాలపై డీసీఏకి ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం.

వైద్యుడి అరెస్ట్.. హైదరాబాద్ తరలింపు

ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఉన్న మాన్విత ఫార్మసికి చెందిన డ్రగ్‌లైసెన్స్‌ను తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ రద్దు చేసింది. డాక్టర్‌ను కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇతడిపై 197/2024 ప్రకారం కేసు నమోదైంది. నార్కోటిక్ డ్రగ్స్ దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలుంటాయని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు.

హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ ఇవే

సల్ఫేట్ ఇంజెక్షన్ 50 ఆంపుల్స్, మార్ఫిన్ సల్ఫేట్ 30 టాబ్లెట్స్, మార్ఫిన్ సల్ఫేట్ ఇంజెక్షన్ 30 యాంపిల్స్, బుప్రిజెసిక్ ఇంజెక్షన్ 25 ఆంపుల్స్, డయోజిపామ్ ఇంజెక్షన్ 9 ఆంపుల్స్, రూమర్ఫ్ ఇంజెక్షన్ 10 ఆంపుల్స్, లిబ్రాక్స్ 46 టాబ్లెట్స్, బుప్రిజెసిక్ 2 ప్యాచ్‌స్, పెంటాజోసిస్ ఇంజెక్షన్ 2 ఆంపుల్స్, మెజోలం ఇంజెక్షన్ 7 సీసాలు, ఇంజెక్షన్ 25 ఆంపుల్స్, నాలోక్సన్ ఇంజెక్షన్ 3 ఆంపుల్స్, వెర్మోర్ ఇంజెక్షన్ 200 ఆంపుల్స్, రూమార్ఫ్ 10 ఎంజీ 10 ఆంపుల్స్, రూమార్ఫ్ 15 ఎంజీ 10 ఆంపుల్స్, వెర్మోర్ 15 ఎంజీ ఇంజెక్షన్ 30 ఆంపుల్స్, మెజోలం 10 మి.లీ ఇంజెక్షన్ నాలుగు సీసాలు.

క్లుప్తంగా

వృద్ధుడి ఆత్మహత్య

జ్యోతినగర్(రామగుండం): వృద్ధాప్యం, ఒంటరితనం భరించలేక ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి అన్నపూర్ణకాలనీకి చెందిన బచ్చు నారాయణ(85) కొడుకు, కోడలు హైదరాబాద్ వెళ్లడంతో ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. శుక్రవారం నారాయణ తండ్రి వెంకటయ్య చనిపోయిన తిథి ప్రకారం గుడికి వెళ్లి బియ్యం దానం చేసి మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చాడు. ఒంటరితనం భరించలేక జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి కుమారుడు శంకరయ్య ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో ఇంటి పక్కవారికి ఫోన్ చేశాడు. వారు వెళ్లి చూడగా ఉరేసుకుని మృతిచెంది ఉన్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పూడిక తీస్తుండగా విద్యుదాఘాతం

- ఒకరి దుర్మరణం

ధర్మారం(ధర్మపురి): నర్సింహులపల్లి గ్రామానికి చెందిన సూర వెంకటస్వామి (21) శనివారం వ్యవసాయ బావిలో పూడికతీత పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన లక్కాకుల రాజయ్య వ్యవసాయ భూమిని ఇదే గ్రామానికి చెందిన పోలం లింగయ్య కౌలుకు తీసుకున్నాడు. వరి సాగుకు సరిపడా నీరు బావిలో లేకపోవడంతో ఇదే గ్రామంలో నివాసం ఉంటూ క్రేన్ సాయంతో బావులు తవ్వుతున్న నల్గొండ జిల్లాకు చెందిన సూర సైదులుకు కౌలు రైతు లింగయ్య పూడికతీత పనులు అప్పగించాడు. బావికి క్రేన్ అమర్చి మట్టిని క్రేన్ డబ్బాలో వేస్తున్న క్రమంలో వెంకటస్వామి ప్రమాదవశాత్తు డబ్బాకు కరెంట్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు.మృతుడు నల్గొండ జిల్లాకు చెందిన వ్యక్తని స్థానికులు తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడు..

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మండల కేంద్రానికి చెందిన ముద్దసాని వెంకటసాయి(27) ఉద్యోగం రాలేదని పురుగుల మందుతాగగా, చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం.. బీటెక్ పూర్తిచేసిన వెంకటసాయి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేశాడు. తోటి స్నేహితులు ఉద్యోగంలో స్థిరపడిపోయారు. దీంతో కలత చెందిన వెంకటసాయి ఈనెల 15న ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి కరీంనగర్, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి పట్టివేత

గోదావరిఖని: గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని శనివారం అరెస్ట్ చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై సుగుణాకర్ తెలిపారు. గంగానగర్ సమీపంలోని మంథని ఎక్స్‌రోడ్డు వద్ద జరిపిన తనిఖీల్లో 1.50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని తిలక్‌నగర్‌కు చెందిన బొబ్బల రాకేశ్, బాసాని కమలాకర్, కాకతీయనగర్‌కు చెందిన చిక్కుడు రాహుల్, విద్యానగర్‌కు చెందిన తాళ్లపెల్లి వంశీని అరెస్ట్ చేశామని అన్నారు.

గురుకులం గురువులు

- చదివిన సంస్థలోనే కొలువుదీరారు
- ఉద్యోగాలు సాధించిన గిరిజన బిడ్డలు
- ఆర్థిక పరిస్థితులను జయించి.. విజయం సాధించి..
- ఆదర్శంగా నిలుస్తున్న పూర్వవిద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వారంతా గిరిజన బిడ్డలు.. మారుమూల తండాల్లో పుట్టిన వారు.. ఉజ్వల భవిష్యత్ కోసం గురుకులం బాట పట్టారు. బాల్యంలో పడిన అడుగులు.. వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేశాయి. గురుకులంలో నేర్పిన క్రమశిక్షణ.. విద్య.. వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాయి. వారు చదివిన గురుకుల విద్యాసంస్థల్లోనే గురువులుగా కొలువుదీరి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గురుకులంలో చదివిన 12 మంది పూర్వవిద్యార్థులు ఇటీవల వెలువడిన గురుకుల టీజీటీ, పీజీటీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు. వారి విజయగాథపై ప్రత్యేక కథనం.



తండాల నుంచి గురుకులాలకు..

రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు తండాలకు చెందిన గిరిజన బిడ్డలు ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని గురుకుల విద్యాసంస్థలో చదువుకుంటున్నారు. తండాలలో కనీస సౌకర్యాలు లేకపోవడం, ఉన్నత విద్య చదివించే ఆర్థిక స్థోమత లేని వారికి గురుకుల విద్యాసంస్థలు బాసటగా నిలుస్తున్నాయి. అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తున్నారు. వారంతా చిన్నతనంలోనే గురుకులంలో చేరి క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నారు. గురుకులంలో నేర్చుకున్న వివిధ అంశాలలో మెరికల్లా తయారవుతున్నారు. కొందరు క్రీడాకారులుగా రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తుంటే.. మరికొందరు ఉన్నత విద్యతో ఇంజినీర్లు, వైద్యులు, ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ పరీక్షలో దుమాల గురుకులంలో చదివిన పూర్వ విద్యార్థులు పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యాబుద్ధులు నేర్పిన గురుకుల సంస్థలోనే గురువులుగా కొలువుదీరారు.

గర్వంగా ఉంది



మా విద్యాసంస్థలో చదివిన పూర్వ విద్యార్థులు గురుకుల ఉపాధ్యాయులుగా ఎంపికవడం గర్వంగా ఉంది. వీరి విజయం తర్వాత వచ్చే విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

– రామారావు, ప్రిన్సిపాల్, దుమాల గురుకులం

అవకాశాలను సద్వినియోగం చేసుకొని..



అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాను. గురుకులంలో అన్ని సౌకర్యాలతో ఉన్నత విద్యనభ్యసించి.. నేడు టీజీటీగా ఎంపికవడం అదృష్టంగా భావిస్తున్న. గురుకులంలో చదువుకున్న పాఠాలే జీవిత పాఠాలుగా మారాయి.

– లకావత్ అనిత, గుండారం

ఆర్థిక పరిస్థితులు వెంటాడినా..



మాది మారుమూల గిరిజన గ్రామం వస్‌పల్లి. మా తండాకు కనీసం బస్సు సౌకర్యం కూడా ఉండేది కాదు. నన్ను చదివించే ఆర్థిక స్థోమత కూడా ఆ సమయంలో మా తల్లిదండ్రులకు లేదు. అయినా గురుకులంలో చదువుకొని ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది.

– భూక్య నిర్మల, వస్‌పల్లి

కష్టపడితే ఫలితం..



గురుకులం విద్యాసంస్థలో చదువుకొని అందులోనే రెండు ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉంది. కష్టపడితే ప్రతీ ఒక్కరికి మంచి భవిష్యత్ ఉంటుంది. పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించి నా తల్లిదండ్రుల కల నెరవేర్చా.

– గుగులోతు మమత, బావుసాయిపేట

తల్లిదండ్రుల కల సాకారమైంది



నా తల్లిదండ్రులు నన్ను ఉన్నతంగా చూడాలని చిన్నప్పుడే గురుకుల విద్యాసంస్థలో చేర్పించారు. అక్కడ నేర్పిన క్రమశిక్షణతోనే నేను ఈ రోజు టీజీటీగా ఎంపికయ్యాను. ఇది నాకు చాలా గర్వంగా ఉంది.

– ఇస్లావత్ జ్యోతి, నిమ్మపల్లి

సంతోషంగా ఉంది



గురుకులంలో చదవి.. అదే సంస్థలో టీచర్‌గా సెలెక్ట్ కావడం చాలా సంతోషంగా ఉంది. టీచర్ పోస్టు కోసం పోటీ బాగా ఉన్నప్పటికీ ఉద్యోగం సాధించడం గర్వంగా ఉంది. మా తల్లిదండ్రుల కలను నెరవేర్చాను.

– లావుడ్య జ్యోతి

ఇటీవల కొలువుదీరింది వీరే..

ఇ.జ్యోతి	టీజీటీ
ఎల్.జ్యోతి	టీజీటీ
ఎం.అనిత	టీజీటీ
గుగులోతు మమత	పీజీటీ
బి.నిర్మల	పీడీ
గుగులోతు లత	లైబ్రేరియన్
బి.వినోద	పీజీటీ
ఎల్.రజిత	టీజీటీ
జి.కవిత	జూనియర్ అసిస్టెంట్
కె.లలిత	నర్సింగ్ ఆఫీసర్
మాలోతు అనిత	నర్సింగ్ ఆఫీసర్

జీవిత కల నెరవేరింది



చిన్నప్పటి నుంచి టీచర్ కావాలనే నా జీవిత కలనెరవేరింది. మా గురుకులంలో గురువులు నేర్పిన పాఠాలు నాకు మార్గదర్శకంగా నిలిచాయి. నేను గురుకులానికి ఎంతో రుణపడి ఉంటాను.

– భూక్య వినోద

నా జీవితానికి మార్గదర్శి



మాది హుస్నాబాద్ ప్రాంతంలోని బాలునాయక్‌తండా. మా ఊరి నుంచి దుమాలలోని గురుకులానికి వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడ్డ. గురుకులం నుంచి వచ్చి పోయేందుకు ఒక్క రోజు పట్టేది. నేడు టీచర్‌గా ఉద్యోగం సాధించా. నా జీవితానికి మార్గదర్శి మా గురుకులం.

– గుగులోతు లత, బాలునాయక్‌తండా

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



లోక్ అదాలత్‌లో జడ్జి శ్రీనివాసరావు తదితరులు



సుల్తానాబాద్‌లో మాట్లాడుతున్న జడ్జి ప్రియాంక



ధర్మారం: లోక్ అదాలత్‌లో జడ్జి వెంకట్‌సచిన్‌రెడ్డి

గోదావరిఖనిటౌన్(రామగుండం): లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం జరుగుతుందని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ దుర్వ అన్నారు. శనివారం గోదావరిఖని అదనపు జిల్లా, సీనియర్ సివిల్ జడ్జి, మున్సిఫ్ కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన మెగా లోక్ అదాలత్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రాజీ మార్గమే రాజ మార్గమని కక్షలు, కార్పణ్యాలతో సాధించేది ఏమీ ఉండదన్నారు. అసిస్టెంట్ పీపీలు నంది రవీందర్, సహీద ఫర్వీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేడ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలకు సమన్యాయం

సుల్తానాబాద్(పెద్దపల్లి): లోక్ అదాలత్‌తో ఇరువర్గాలకు సమన్యాయం జరుగుతుందని సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి జీఎస్ఎల్ ప్రియాంక అన్నారు. కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మాట్లాడారు. లోక్ అదాలత్‌లో 378 కేసులు పరిష్కరించినట్లు వివరించారు. న్యాయవాది జోగుల రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీపీ శ్యాంప్రసాద్, ఏజీపీ మేకల తిరుపతిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

200 కేసులు పరిష్కారం

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నందిమేడారం కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి వెంకట్‌సచిన్‌రెడ్డి లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. దాదాపు 200 కేసులు పరిష్కరించారు. ఎస్సై అశ్విని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఆకారి రాజేశం, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం

పెద్దపల్లిరూరల్: లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ డి.హేమంత్‌కుమార్ అన్నారు. పెద్దపల్లి కోర్టులో 547 కేసులు పరిష్కారమైనట్లు వివరించారు. న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్

జ్యోతినగర్(రామగుండం): ప్రభుత్వరంగ సంస్థల్లో రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ షభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని మిలీనియం హాలులో ఎన్టీపీసీ ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంస్థలో రిజర్వేషన్లను అమలు చేసేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. సంస్థలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంస్థ లైజన్ అధికారి సమావేశానికి కాస్త ఆలస్యంగా రావడంతో కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్‌కుమార్ బాబు కొంత అసహనం వ్యక్తం చేయడంతో పాటు సంస్థలో ఉద్యోగులకు రిజర్వేషన్లు ఏ విధంగా అమలవుతున్నాయని, ఉద్యోగుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేయాలని సూచించారు. తర్వాత సమావేశంలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి, రాజ్యాంగ నిర్మాతల చిత్రపటాలు లేకపోవడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. అధికారులు హుటాహుటిన వెంటనే అంబేద్కర్, మోదీ చిత్రపటాలను ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న వడ్డెపల్లి రాంచందర్

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో సమావేశం

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌కు ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు పూల మొక్క అందించి స్వాగతించారు. అనంతరం మిలీనియం హాలులో జరిగిన సమావేశంలో ఎన్టీపీసీలోని పలు విభాగాల అధికారులతో రిజర్వేషన్ల అమలుపై చర్చించారు. ఉద్యోగుల పదోన్నతితో పాటు రిజర్వేషన్ ప్రక్రియ అంశాలను సత్వరం పరిష్కరించాలని సూచించారు. ఈడీ మాట్లాడుతూ, ఎస్సీ కమ్యూనిటీకి సంబంధించిన ప్రాంతాలలో క్రియాశీలకంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు. ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్, పలువురు అధికారులు పాల్గొన్నారు. కాగా ఎన్టీపీసీలో విధులు నిర్వహించి, ఇటీవల రాజీనామా చేసి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన రాంచందర్‌ను జ్యోతిభవన్‌లో వివిధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు.

పోటీని తట్టుకొని అవకాశాలు దక్కించుకోవాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: విద్యావంతులైన నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పెద్దపల్లిలో టాస్క్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. పెద్దపల్లిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం ఎమ్మెల్యే విజయరమణారావు, టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సిన్హాతో కలిసి సెంటర్‌ను ప్రారంభించారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు జిల్లాలో టాస్క్ సెంటర్ ప్రారంభమైందని పేర్కొన్నారు. మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకుని ఉపాధి అవకాశాలు దక్కించుకునేందుకు నైపుణ్య శిక్షణ తప్పనిసరైందని వివరించారు. సెంటర్ ద్వారా 110 పైగా కోర్సుల్లో శిక్షణ ఇస్తారని, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో 1,500 పైగా నిరుద్యోగ యువత తమ పేర్లు నమోదు చేసుకున్నారని, వారంతా ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుంటే ఉద్యోగావకాశాలు దక్కించుకోవడం సులువుగా ఉంటుందన్నారు. టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ, ఇప్పటివరకు రాష్ట్రంలో 12 కేంద్రాలు ఏర్పాటయ్యాయని 750 పైగా విద్యాసంస్థలతో సమన్వయం చేసుకుంటూ 18వేల మంది ఫాకల్టీల తో 9లక్షల మంది యువతకు శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి, ఉమ్మడి కరీంనగర్ మేనేజర్ గంగాప్రసాద్, కమిషనర్ వెంకటేశ్ తదితరులున్నారు.



విద్యార్థులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే విజయరమణారావు, చైర్‌పర్సన్ మమతారెడ్డి, టాస్క్ ప్రతినిధులు

డివైడర్ ఢీకొని లారీ బోల్తా

- డ్రైవర్ మృతి.. క్లీనర్‌కు తీవ్రగాయాలు

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ పట్టణంలోని నెహ్రూ విగ్రహం వద్ద రాజీవ్ రహదారి మూలమలుపులో చెత్తను తరలిస్తున్న లారీ శనివారం వేకువజామున ప్రమాదవశాస్తు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. అందులో ఉన్న డ్రైవర్ రాజన్, క్లీనర్ హితేంద్ర మున్నాలాల్ తీవ్రంగా గాయపడగా, వారిని లారీ క్యాబిన్ నుంచి తీసి ప్రైవేటు వాహనంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాజుల రాయమల్లు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ రాజన్(40) చికిత్స పొందుతూ మృతిచెందగా, క్లీనర్‌కు తీవ్ర గాయాలైనాయి. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. హైదారాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాజానంద్‌గాంలోని చెత్త ఆధారిత విద్యుత్ ప్లాంట్‌కు వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఈప్రమాదంలో మహారాష్ట్రలోని సిర్పూర్‌కు చెందిన డ్రైవర్ రాజన్ తీవ్రంగా గాయపడ్డాడు. సుల్తానాబాద్ ఆసుపత్రి అనంతరం కరీంనగర్ తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. క్లీనర్ హితేంద్ర మున్నాలాల్ చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా లారీ బోల్తాపడి రోడ్డుపై చెత్త కింద పడడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులుపడ్డారు.

తల్లిదండ్రులను విస్మరించవద్దు



బసంత్‌నగర్‌లో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

పాలకుర్తి(రామగుండం): సమాజంలో ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా తల్లిదండ్రులను, ఉన్న ఊరును విస్మరించవద్దని రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు అన్నారు. శనివారం బసంత్‌నగర్‌లోని పరికిపండ్ల సత్యనారాయణ సంస్మరణ శంకర్ విజన్ కంటి ఆసుపత్రిని సందర్శించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి తన తండ్రి స్మారకార్థం కంటి ఆసుపత్రి నిర్మించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి చెడు వ్యసనాలకు అలవాటుపడకుండా ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదవి గొప్పస్థాయిలో నిలిచేందుకు ప్రయత్నించాలని కోరారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, బసంత్‌నగర్ ఎస్సై స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఠాణాల సందర్శన

రామగుండం: రామగుండం, అంతర్గాం పోలీస్‌స్టేషన్లను శనివారం సీపీ శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించారు. ఏసీపీ రమేశ్ పూల మొక్క అందజేసి సీపీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీ అంతర్గాం స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది వివరాలు, తదితర అంశాలను తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై పోలీసు అధికారులతో చర్చిస్తూ సూచనలు, సలహాలిచ్చారు. సీఐ అజయ్‌బాబు, ఎస్సైలు సతీశ్, వెంకట్ తదితరులున్నారు.

సమష్టిగా కృషి చేయాలి



కాన్ఫరెన్స్‌లో సీఎండీ బలరాంనాయక్

రామగిరి(మంథని): సింగరేణి అభివృద్ధికి పాటుపడుతూ ఉత్తమ సేవలందించడం అభినందనీయమని సంస్థ సీఅండ్ఎండీ నూనవాత్ బలరాం నాయక్ అన్నారు. ఆర్జీ–3 పరిధి ఓసీపీ–1 గనిలో శుక్రవారం నిర్వహించిన ప్రొడక్షన్ డేలో భాగంగా రోజువారీ ఉత్పత్తికి అదనంగా 5,000 టన్నులతో మొత్తం 18,000 టన్నుల బొగ్గు ఉత్పత్తికి కృషి చేసిన జీఎం ఎస్.సుధాకర్‌రావు, ఓసీపీ–1 ప్రాజెక్టు అధికారి ఎన్.రాధాకృష్ణ, ఉద్యోగులు, సూపర్‌వైజర్లకు సీఎండీ అభినందనలు తెలిపారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఓసీపీ–1 ఉద్యోగులతో మాట్లాడారు. ఉత్పత్తి, ఉత్పాదకతలో ముందుడటం శుభపరిణామమని, వయస్సుతో తేడా లేకుండా యువ ఉద్యోగులతో పోటీ పడుతూ సేవలందించడం సంతోషకరమన్నారు. అనంతరం ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఎస్‌డీఎం సుబానీ, డి.లలిత్‌కుమార్, రాధాకృష్ణ, శ్రీనివాస్, ఉదయ్‌హరిజన్, ముప్పిడి రవీందర్‌రెడ్డి, గుర్రం శ్రీహరి, గుర్తింపు సంఘం ప్రతినిధులు డీటీ రావు, గడ్డం తిరుపతి పాల్గొన్నారు.

కవితను బేషరతుగా విడుదల చేయాలి



పెద్దపల్లి బస్టాండ్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

పెద్దపల్లిరూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను అక్రమంగా అరెస్టు చేశారంటూ శనివారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సారథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దపల్లి బస్టాండ్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి పోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి నిరసనకారులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. కవితను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఉప్పు రాజ్‌కుమార్, మర్కు లక్ష్మణ్, నాయకులు శ్రీనివాస్, కొమురయ్య, పందిల్ల లక్ష్మణ్, తీగల సదయ్య, ప్రేంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిల్టర్ ప్లాంట్‌కు భూమిపూజ

గోదావరిఖని: ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ ప్లాంట్‌కు శనివారం భూమి పూజ చేశారు. జీడీకే–1,3వ గని ఫ్యాన్‌హౌస్ సమీపంలో 35ఎంఎల్‌డీ కెపాసిటీ గల ప్లాంట్‌కు సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సింగరేణి క్వార్టర్లకు స్వచ్ఛమైన తాగునీరందరించేందుకు రూ.18 కోట్ల వ్యయంతో ప్లాంట్ నిర్మిస్తున్నట్లు వివరించారు. రీజియన్‌లోని ఆర్జీ–1,2,3 ఏరియాల కార్మిక కుటుంబాలకు ఈ నీటిని అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం శ్రీని వాస్, సివిల్ జీఎం సూర్యనారాయణ, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్, జీఎం శ్రీనివాస్ తదితరులు